క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రకళా పోటీలు



చిత్రలేఖనం పోటీలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ

యానాం: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రకళా పోటీలు నిర్వహించారు. యానాం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ ఖండవిల్లి రామకృష్ణ, విద్యాశాఖ అధికారి పి.ప్రవీణ్, జూనియర్ ఇంజినీర్ జి.లక్ష్మి స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధి ఎస్.దేవానాంప్రియ తదితరులు పర్యవేక్షించారు.

బాణసంచా బాధితులను ఆదుకుంటాం



కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్

అమలాపురం రూరల్: పట్టణంలో రావులచెరువు బాణసంచా ప్రమాదంలో గాయపడిన కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అమలాపురం ఎంపీ జి.హరిష్‌మాథుర్ శుక్రవారం పరామర్శించారు. గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. బాధితులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీ అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన నాగలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందిస్తామని ఎంపీ తెలిపారు.

గ్యాస్‌పైపు లీక్‌పై అనుమానాలు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గౌతమీ గోదావరి నది, బంగాళాఖాతం కలిసే ప్రదేశం వద్ద దరియాలతిప్ప ఎస్సీ సొసైటీ భూముల సమీపాన గ్యాస్ లీకయిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తక్షణం అధికారులు స్పందించాలని యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మత్స్యకార నాయకుడు అర్దాని దినేష్ కోరారు. శుక్రవారం ఆయనతో వీసీకే పార్టీ నాయకులు తదితరులు కలసి పలువురు ప్రత్యేక బోటుపై నది లోపల వేసిన గ్యాస్ పైపు లైను లీకవడంతో గ్యాస్ ఒత్తిడికి గురై అలలు వస్తున్న దృశ్యాలను వీడియో తీసి దానిని స్థానిక మీడియాకు విడుదల చేశారు. ఈ ప్రాంతం గుండా గతంలో రిలయన్స్‌తో పాటు ఓఎన్జీసీ సైతం గ్యాస్ పైపులైన్లు వేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఒక ప్రదేశంలో ఉవ్వెత్తున నదీ జలాలు ఎగసి పడుతుండటంతో గ్యాస్ లీకై ఉంటుందని భావిస్తున్నామన్నారు. అయితే ఈ విషయాన్ని ధ్రువీకరించడానికి సంబంధిత రిలయన్స్, ఓఎన్జీసీ అధికారులు అందుబాటులో లేరు.

డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేత

ముమ్మిడివరం: జీఓ నంబరు 85 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరంలో శుక్రవారం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేశామన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చలు జరిపి తమ డిమాండ్లు పరిష్కారం కాలేదని తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని వైద్యులు పేర్కొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీఎంఅండ్‌హెచ్ఓ డా.దుర్గారావుదొర కు అందజేశారు. కార్యక్రమంలో డా.మణికుమార్, ఇందిరా రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

తాళ్లరేవు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలకు సంబంధించి మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం చొల్లంగిలో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఎంపికల్లో తొలిరోజు చొల్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ క్రీడలకు సంబంధించి అండర్ 14, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వీకేఆర్ తంబి తెలిపారు. రెండోరోజు జార్జిపేటలో బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు తంబి తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీలను పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ బూరెల సూర్య ప్రభావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు రూ.38,500 విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు.

స్కూల్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో 68 వ స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో వివిధ క్రీడల్లో కీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని ఎంఈఓ కిరణ్‌బాబు తెలిపారు. పాఠశాల హెచ్ఎం జీఎస్‌వీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కానుకు గౌతమి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలను నిర్వహించారు.

మాయల కూటమి

- హామీల జోరు... అమలులో బేజారు
- వంద రోజుల పాలనపై ప్రజల మండిపాటు
- ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీల అమలుపై మీనమేషాలు



అమలాపురం పట్టణం



ఉప్పలగుప్తం మండలంలో ఆక్రమణలతో బక్కచిక్కుతున్న కూనవరం మేజర్ డ్రెయిన్



ఐ.పోలవరం మండలం ఎదుర్లంకలో నదీ కోతకు గురవుతున్న లంక భూములు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం వచ్చి అప్పుడే వంద రోజులు పూర్తయింది. అమలాపురం, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు అటు ఎన్నికలకు ముందు, ఇటు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా నియోజకవర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు అనేకం ఉన్నా అమలుకు ఇంకా శ్రీకారం చుట్టే ప్రయత్నమే లేదు. ఇక ఎన్నికల ప్రచారంలో భాగంగా అమలాపురం వచ్చిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కోనసీమకు వరాల జల్లులు హామీల రూపంలో కురిపించారు. ఆ హామీలు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకూ మేలు చేసే దిశగా ఉండడంతో వాటి అమలుపై రెండు నియోజకవర్గాల ప్రజలు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ తమ నియోజక వర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే కనీసం రూ.300 కోట్లు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలైన సూపర్ సిక్స్ పథకాలకే నిధుల లేమితో అమలుకు వెనుకంజ వేస్తున్న తరుణంలో ఈ రెండు నియోజవవర్గాలకు రూ.300 కోట్లు మంజూరు చేసే ఆర్థిక దన్ను రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేదన్న వాస్తవం రెండు నియోజకవర్గాల ప్రజలకు తెలియంది కాదు. మధ్యలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ కూడా అనేక హామీలు ఇచ్చారు. వాటి అమలులో కూడా పురోగతికి పునాది రాయే పడలేదు.

అధినేతలు ఇచ్చిన హామీలు ఇలా..

- ఎన్నికలకు ముందు అమలాపురంలో జరిగిన ప్రచార సభలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కోనసీమకు తొందర్లోనే రైలును తీసుకుని వస్తామని హామీ ఇచ్చారు.
- కోనసీమకు ప్రధాన ఆదాయ వనరైన కొబ్బరి పంటను అనుబంధ పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు పెంచుతాం.
- ఎంపీ హరీష్ మాథుర్ కూడా ఎన్నికల ముందు ప్రతి ప్రచార కార్యక్రమంలో కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ నేనే పూర్తి చేస్తానని హామీలు ఇచ్చారు. కోనసీమ నదీ పరీవాహక నదీ కోతను నివారిస్తానని హామీలు ఊదరగొట్టారు.

అయితాబత్తుల ఆనందరావు హామీలిలా...

- జిల్లా కేంద్రం అమలాపురం పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాను.
- అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా మూడు ప్రధాన వంతెనలతో పాటు మరో మూడు మొత్తం ఆరు వంతెనలు నిర్మిస్తాను.
- నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవస్థను నెలకొల్పుతాను.
- అమలాపురంలో వృత్తి విద్యా కోర్సుల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు మెరుగు పడేలా పాలిటెక్నికల్ కళాశాలను తీసుకువస్తాను.
- నియోజకవర్గంలో రోడ్లు పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తాను.
- నియోజకవర్గంలో పంట కాల్వలు, డ్రెయిన్లను ఆధునీకరించి రైతులకు ముంపు కష్టాలు తీర్చుతాను.

ఇచ్చిన హామీల అమలు శూన్యం

ఎమ్మెల్యే ఆనందరావు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేసింది శూన్యం. ఇచ్చిన ప్రధాన ఆరు హామీలకు ఇంకా కార్యరూపం అటుంచి కనీసం ప్రతిపాదనల ప్రయత్నం కూడా లేదు. అమలాపురం పట్టణం మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు సహకరిస్తే పట్టణాన్ని మోడల్ సిటీ చేస్తానన్నారు. పట్టణానికి ముందు ఆరు వంతెనలు కాదు... ఈదరపల్లి, నల్ల వంతెన, ఎర్రవంతెనలకు ప్రత్యామ్నాయ వంతెనల నిర్మాణం అత్యవసరం. గత ప్రభుత్వం ఈ మూడు వంతెనలకు కనీసం ప్రతిపాదనలు, అంచనాలతో దశ దాటి రూ.9 కోట్లు మంజూరుకు నోచుకుంది. ఇప్పుడు ఈ మూడు వంతెనలు పాత మంజూరుతో నిర్మిస్తారా...? ఎమ్మెల్యే ఆనందరావు కొత్తగా ప్రతిపాదనలు తయారు చేయించి మూడు వంతెనలకు కొత్తగా నిధులు మంజూరు చేయిస్తారా..? ఎదురు చూడాలి.

దాట్ల బుచ్చిబాబు ఇచ్చిన హామీలు..

- నియోజకవర్గంలోని నదీ పరీవాహక లంక గ్రామాలైన సలాది వారిపాలెం, శేరులంక, గురుజాపులంక, తానేలంక తదితర గ్రామాల్లో నదీ కోతను నివారిస్తూ రక్షణ ఏర్పాట్లు చేస్తానని ప్రధాన హామీ ఇచ్చారు.
- జి.మూలపొలం-పల్లంకుర్రు మధ్య వృద్ధ గౌతమీ నదీ పాయపై వంతెన నిర్మిస్తాను.
- తాళ్లరేవు మండలానికి తాగునీరు, సాగునీరు అందించే ప్రధాన పంట కాల్వ ఇంజరం గ్రామంలో శిథిలమైన వంతెన స్థానే కొత్త వంతెనను ఆరు నెలల్లో నిర్మిస్తాను.
- కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో ఉన్న మత్స్యకార గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బుచ్చిబాబు వారికి అనేక హామీలు గుప్పించారు. చమురు సంస్థల నుంచి మత్స్యకారులకు రావాల్సిన నష్ట పరిహారాన్ని త్వరిత గతిన ఇప్పించడమే కాకుండా వేట నిషేధ సమయంలో మత్స్యకార భృతి నిధులు కూడా తక్షణమే ఇప్పిస్తానని హామీలు ఇచ్చారు.

హామీల అమలుకు శ్రీకారం ఏది..?

ఎమ్మెల్యే బుచ్చిబాబు ఇచ్చిన హామీలకు ఇంకా శ్రీకారం చుట్టనే లేదు. కొత్త ప్రభుత్వం వచ్చి అప్పుడే మూడు నెలలు ముగిసింది. ఇంజరం వంతెన నిర్మాణాన్ని ఆరు నెలల్లో నిర్మిస్తామన్నారు. ఇప్పటి వరకూ ఆ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనల జోలికే పోలేదు. నదీ కోత నివారణకు అసలు ఇప్పటి వరకూ ఓ ప్రణాళిక రూపకల్పనే లేదు. జి.మూల పొలం-పల్లంకుర్రు మధ్య నదీపాయపై వంతెన నిర్మాణానికి ప్రయత్నమే లేదు. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ఆయన ఇచ్చిన హామీలకు ఇంకా అమలు ప్రయత్నమే జరగడం లేదు.

ఆధునీకరణ లేక పంట నష్టపోయాను



పంటకాల్వలు, డ్రెయిన్లు సకాలంలో ఆధునీకరించక నేను నా 14 ఎకరాల్లో పంట నష్టపోయాను. ఎకరాకు సాగు కోసం రూ.10 వేలు చొప్పున ఖర్చు అయింది. వ్యవసాయ సాగును ప్రభుత్వం ఆదుకోవడం కంటే అత్యవసరంగా పంట కాల్వలు, డ్రెయిన్లు ఆధునీకరించాలి. నియోజకవర్గంలో కాల్వలు, డ్రెయిన్ల ఆధునీకరిస్తామని ప్రస్తుతం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. పంట కాల్వలు, డ్రెయిన్లు పూడికలు, చెత్తా చెదారం, ఆక్రమణలో నిండిపోయి రైతులకు ఆపద కాలంలో అక్కరకు రావడం లేదు. వీటిని ఆధునీకరిస్తేనే రైతులు ముంపు సమస్య నుంచి బయట పడతారు. లేని పక్షంలో సాగుకు ఫలితం లేదు.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

గ్రోయిన్లు నిర్మించాలి



నియోజకవర్గంలోని లంక గ్రామాలు, ఏటిగట్లు నదీ కోతకు గురవుతున్నాయి. తాళ్లరేవు మండలం గోవలంక వద్ద కోత మరీ ఎక్కువగా ఉంది. నదీ, ఏటిగట్ల కోతను శాశ్వతంగా నివారించేందుకు తక్షణమే నదీ కోతలను గుర్తించి గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు నిర్మించాలి. మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో గ్రోయిన్లు నిర్మించారు. ఇప్పుడు ఎమ్మెల్యే నదీ, ఏటిగట్ల కోత నివారణకు చర్యలు చేపతానని ఇచ్చిన హామీను తక్షణమే అమలు చేయాలి. లేనిపక్షంలో విలువైన లంక భూములు, గ్రామాలు నదీ పాతం అవుతాయి.

– కూరాటి వాసుదేవ వరప్రసాద్, గోవలంక, తాళ్లరేవు మండలం

విస్ఫోటం క్షతగాత్రులకు ఆర్థిక సాయం



గాయపడిన వారి బంధువుకు ఆర్థిక సాయం అందిస్తున్న నాగసుధా కొండ

అమలాపురం టౌన్: రావులచెరువు బాణసంచా విస్ఫోటంలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఆజాద్ ఫౌండేషన్ రూ.5 వేల ఆర్థిక సాయం చేసింది. క్షతగాత్రుల వైద్యం, ఇతర అవసరాలకు పూర్తిగా ఆదుకోవాలని ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమల్లి నాగసుధాకొండ విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఆస్పత్రిలో వారి బంధువులకు ఫౌండేషన్ తరపున నాగసుధా కొండ శుక్రవారం అందజేశారు. క్షతగాత్రులకు రక్తం అత్యవసరమైతే ఏ సమయంలోనైనా సమకూర్చేందుకు తమ ఫౌండేషన్ సిద్ధంగా ఉందని వారికి హామీ ఇచ్చారు.

నాగలక్ష్మి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

అమలాపురం బాణసంచా విస్ఫోటంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గొవ్వాల నాగలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అలాగే విస్ఫోట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మరింత మెరుగైన వైద్యం కోసం రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. అలాగే బాణసంచా విస్ఫోటంలో గొవ్వాల నాగలక్ష్మి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి పాలమూరి మోహన బాబు డిమాండ్ చేశారు. అక్రమ బాణసంచా తయారీ దారులపై సరైన నిఘా ఉంచి ఆదిలోనే కఠిన చర్యలు తీసుకుంటే నాగలక్ష్మి మృతి సంభవించేది కాదని పేర్కొన్నారు.

భారీ వర్షానికి రోడ్లు జలమయం



భారీ వర్షానికి అమలాపురంలో జలమయమైన రోడ్లు

అమలాపురం టౌన్: పట్టణంలో శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకూ ఏకధాటిగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి జన సంచారం లేక రోడ్లు వెలవెలబోయాయి. కొన్ని దుకాణాలు కూడా వర్షం వల్ల మూతపడ్డాయి. సాయంత్రం నుంచి దాదాపు జనజీవనం స్తంభించింది. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, అశోక్‌నగర్, కుంకాల సందు తదితర రోడ్డు జలమయమయ్యాయి.

22 మందికి ఉద్యోగావకాశాలు



ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో దివీస్ ల్యాబ్ కంపెనీ శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 22 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఎంపికైన ఉద్యోగార్థులకు వార్షిక వేతనం రూ.3 నుంచి రూ.4 లక్షల వరకూ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కేవీఆర్ఎస్ నరసింహారావు, ఏవో కరాటం ప్రవీణ్ తదితరులు అభినందించారు

దసరా వేడుకలకు పందిరిరాట ముహూర్తం



ముమ్మిడివరంలో వేసిన పందిరి రాట

తాళ్లరేవు: స్థానిక కేశవస్వామి బైపాస్ కాలనీలో విజయ కనకదుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం దసరా ఉత్సవాల అంకురార్పణలో భాగంగా పందిరిరాట కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు మర్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పందిరిరాట వేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దేవీనవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి రెడ్డిబాబు, పాటి శంకర్, నురుకుర్తి ఏడుకొండలు, మేడిశెట్టి శ్రీను, సమనస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: స్థానిక హైస్కూల్ సెంటర్ వద్ద విజయ దుర్గాంబికా యువజన వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్ర మహోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. 15 వసంతాలు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా వేముల వలస చిన్నారావు ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం చేశారు. కార్యక్రమంలో విత్తనాల వీవీ సత్యనారాయణ, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, వి.సూరపరాజు, జి.దుర్గా వెంకట మణికంఠ, గ్రంధి రామకృష్ణ, పొత్తూరి శ్రీను, నూలు మురళి, కొప్పిసీడి వీరన్నబాబు, మట్టపర్తి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాకులకు ఆహారంగా బూందీ

అమలాపురం టౌన్: కాకుల ఆహారం కోసం స్థానిక గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో నెలకు రూ.80 వేల విలువైన కారం బూందీని ఆహారంగా అందిస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

స్థానిక మోబర్లీపేట, నడింపల్లి సుబ్బరాజు వీధి, కల్వకొలను వీధి, విద్యుత్ నగర్, నల్ల వంతెన, ఎర్ర వంతెన, పద్మినీపేట ప్రాంతాల్లో రోజూ కాకులకు కారం బూందీ ఆహారంగా వేస్తున్నామని వారు చెప్పారు.

కథాసాహిత్యంలో పాఠ్యాంశంగా రత్నాకర్ రచన

'ఈ పొలం అమ్మబడును' కథను ఎంపిక చేసిన ఉన్నత విద్యాశాఖ

యానాం: యానాంకు చెందిన పెనుమాక రత్నాకర్ రచించిన 'ఈ పొలం అమ్మబడును' కథను కథాసాహిత్య విభాగంలో డిగ్రీ సిలబస్‌లో పాఠ్యాంశంగా ఎంపిక చేస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆఫ్ కాలేజెస్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఉషాపత్రిక నిర్వహించిన ప్రపంచస్థాయి కథల పోటీల్లో రత్నకర్ రచించిన 'ఈ పొలం అమ్మబడును' కథకు ప్రథమ బహుమతి లభించింది. అదే విధంగా సహరి పత్రికలో సైతం ప్రచురితమయింది. ఈ నేపథ్యంలో డిగ్రీ మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈ కథను పాఠ్యాంశంగా కమిటీ ఎంపిక చేసింది. ముఖ్యంగా ఈ కథలో పల్లెల్లోకి రియల్‌ఎస్టేట్ వాళ్లు అక్రమంగా చొరబడి ప్రగతిని పల్లెలికి, వ్యవసాయాన్ని ఏ విధంగా నష్టపరుస్తున్నారో తెలియజేయడమే కాకుండా ఈ సమస్యకు ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని చూపుతూ రచన సాగింది. ముఖ్యంగా ప్రస్తుత విద్యార్థులకు ప్రగతిపట్ల, పల్లెల పట్ల, వ్యవసాయం పట్ల తమ అభిరుచిని ఏర్పరుచుకునేలా చేస్తుండటంతో ఈ కథను పాఠ్యాంశంగా ఎంపిక చేసినట్లు కమిటీ పేర్కొంది. ఈ కథ యునెస్కో. ఓఆర్జీ ఫర్ యూత్-వేగింగ్-పీస్ వెబ్‌సైట్ లింక్‌లో ఉంచారు. తాను రచించిన ఈ పొలం అమ్మబడును కథను డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ చేర్చుతూ నిర్ణయం తీసుకున్నందుకు ఆనందంగా ఉందని రచయిత పెనుమాక రత్నాకర్ పేర్కొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

తాళ్లరేవు: జార్జిపేట గ్రామ పంచాయతీలో రూ.1.92 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శుక్రవారం భూమిపూజ చేశారు. స్థానిక పెదపాటి వారి వీధిలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.1.62 కోట్లతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు, సంపు, ఇంటింటికీ కుళాయికి సంబంధించి పైపులైన్ తదితర పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదే విధంగా స్థానిక నందిబొమ్మ కాలనీలో రూ.30 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రహదారులకు కూడా ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో సర్పంచ్ గుత్తుల సత్యవేణి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి పనులు వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు తాళాలు

డీవైఈవో తనిఖీ

అమలాపురం రూరల్: అమలాపురం మండలం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన రక్షిత మంచినీరు అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌కు పాఠశాల యాజమాన్యం తాళాలు వేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేరూరు జెడ్పీ పాఠశాలకు నాడు-నేడు పథకంలో సుమారు రూ.కోటితో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మోటారు రిపేర్ కారణంగా చూపించి ఆర్వో ప్లాంట్‌కు ఉపాధ్యాయులు తాళాలు వేశారు. ఈ విషయంపై ఎట్టకేలకు డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాష్‌రావు హైస్కూళ్లను శుక్రవారం తనిఖీ చేసి మోటార్లు రిపేరు చేయించి రెండు మూడు రోజుల్లో వాటర్ ప్లాంట్ వాడుకలోకి తెస్తామని తెలిపారు.

కృష్ణ పద్మరాజుకు వ్యాపార సంఘాల సత్కారం

అమలాపురం టౌన్: జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక ముమ్మిడివరం గేటు సెంటర్‌లో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, మాజీ అధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు కృష్ణపద్మరాజును సత్కరించారు.

రెండు వీధుల్లో ఆయుధ పూజలు

అమలాపురం టౌన్: పట్టణంలో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ కొంకాపల్లి, నల్లా వీధి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆయా వీధుల్లో చెడీ తాలింఖానా ప్రదర్శనలకు ఉపయోగించే ఆయుధాలకు గురువారం రాత్రి పూజలు జరిగాయి. చెడీ తాలింఖానా ఆరాధ్య దైవమైన భేతాళస్వామికి తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొంకాపల్లి, నల్లా వీధికి చెందిన పిల్లలు, పెద్దలు వృద్ధులు ఆ ఆయుధాలతో విన్యాసాలు చేస్తూ చెడీ తాలింఖానా వీర విద్యపై మరిన్ని మెళకువలతో కసరత్తు చేశారు. కొంకాపల్లి ఆయుధ పూజలో ఆ వీధి ఉత్సవ కమిటీ పెద్దలు పనసా బుజ్జి, సూదా గణపతి, త్సవటపల్లి రాంబాబు, పనసా అబ్బు, నల్లా వీధి ఆయుధ పూజలో ఆ వీధి కమిటీ పెద్దలు ఆశెట్టి ఆదిబాబు, కోన స్వామి తదితరులు పాల్గొని పూజలు చేశారు.

నల్లమిల్లిలో 'స్వచ్ఛతాహి సేవ' ర్యాలీ

అమలాపురం రూరల్: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నల్లమిల్లిలో శుక్రవారం చెత్తాచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ గోకరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ప్రజలకు అవగాహన కల్పించారు. స్కూల్ విద్యార్థులతో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఏపీఎం పీవీవీ రమణి అన్నారు. స్వచ్ఛతాహి సేవ వారోత్సవాల్లో భాగంగా అమలాపురంలోని మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో ఏపీఎం రమణి ఆధ్వర్యంలో శుక్రవారం చెత్త కుప్పలను తొలగించారు. అనంతరం ర్యాలీ చేశారు. ప్రజలు తమ ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో విజయకుమారి, సీసీలు వెంకటలక్ష్మి, మహిళా సమాఖ్య సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం

అమలాపురం రూరల్: భట్నవిల్లిలో ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం జరిగింది. సచివాలయం సిబ్బంది టీడీపీ ఫ్లెక్సీలను ఉంచి వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలను కావాలనే ఎందుకు తొలగిస్తున్నారంటూ సచివాలయం సిబ్బందిని వైఎస్సార్ సీపీ కార్యకర్త పాటి రవి నిలదీశారు. మొత్తం గ్రామంలోని అన్ని పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని డిమాండ్ చేశారు.

క్రీడల్లో రాణించాలి

ఉప్పలగుప్తం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్ -14, 17 ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీలకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, హెచ్ఎం ఎల్. రాణి, ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, నాయకులు సలాది నాగరాజు, మంచెం బాలకృష్ణ, గుత్తాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పని తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం చేస్తున్న పని తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని స్థానిక పంచాయితీ పరిధిలో ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ×ఇది మంచి ప్రభుత్వం× కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 26 వరకు ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన పని తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

తాళ్లరేవు: చొల్లంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎంఈఓలతో కలసి పరిశీలించారు. పాఠశాల కిచెన్‌ను సందర్శించి మెనూను అడిగి తెలుసుకున్నారు. కోడిగుడ్ల నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వండి వడ్డించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు రాయుడు గంగాధర్, యడ్ల కుటుంబరావు, ఎంతఈటలు మంగాయమ్మ, మోకా ఉమ తదితరులు ఉన్నారు.

గణపతి నిమజ్జనం

కాట్రేనికోన: కాట్రేనికోనలో నవరాత్రులకు పూజలు అందుకున్న గణపతి నిమజ్జనం శుక్రవారం జరిగింది. గణపతి నవరాత్రుల సందర్భంగా చలువ పందిరిలో కొలువుదీరిన గణనాథుడికు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి నిమజ్జనంలో సంప్రదాయ పద్ధతిలో భక్తి గీతాలు, భజన కీర్తలతో సనాతన ధర్మాన్ని పాటించి ఊరేగింపు చేపట్టారు. ముందుగా గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా కాట్రేనికోనకు చెందిన వేద పండితులు ఆకొండి శంకర శాస్త్రికి వర్తక సంఘం, గణపతి ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానం చేశారు.